క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అడవులకు నిప్పు పెట్టడం నేరం



కళాజాతా నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అడవులకు నిప్పు పెట్టడం నేరమని కళాకారులు వీరభద్రయ్య అన్నారు. నల్లకాల్వ గ్రామంలో గురువారం 'అడవులకు నిప్పు మానవాళికి ముప్పు' అనే అంశంపై కళాప్రదర్శన నిర్వహించారు. అడవులు పచ్చగా ఉండే పక్షులు, జీవరాసులు ప్రశాంతంగా జీవిస్తాయని, నిప్పు పెడితే పక్షులు, ఔషధ మొక్కలు కాలిపోవడం వలన జీవకోటికి ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని కళా రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు చిన్నయ్య, ఎఫ్ఎస్ఓ ఖాజావలి, ఎఫ్‌బీఓ సువర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

పాములపాడు: మండల కేంద్రంలోని రామాలయంలో గురువారంతో సప్తాహం ముగిసింది. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు భక్తులు నిర్విరామంగా ఓం నమో నారాయణాయ అనే మంత్రోచ్చారణను 8 రోజుల పాటు రాత్రింబవళ్లు బృందాల వారీగా చేపట్టారు. గ్రామ సంక్షేమం కోసం ఈ మంత్రోచ్చరణ చేపట్టినట్లు భక్తులు తెలిపారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

మహానంది: నంద్యాలకు చెందిన వైద్యులు అరుణ్‌కుమార్, మురళీల సహకారంతో గాజులపల్లె ఆర్ఎస్ గ్రామంలోని గిరిజనులకు హర్ సెల్ఫ్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం గ్రామంలో శ్రీరామనవమి వేడుకల అనంతరం దుప్పట్లు అందించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిరిజన నాయకుడు వీరన్న, వైఎస్సార్‌సీపీ నేతలు కందుల శ్రీనివాసులు, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి అన్నారు. శ్రీరామనవమి, తిరునాలను పురస్కరించుకుని పగిడ్యాలలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడాకారుడు విజయ్ ప్రకాష్‌రెడ్డి జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందించేందుకు ముందుకు వచ్చిన దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, భూషిరెడ్డి, బాబురెడ్డి, భాస్కరరెడ్డి, మోక్షంరెడ్డి తదితరులు ఉన్నారు.

సీపీఎం కార్యాలయ నిర్మాణానికి సహకరిస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: పట్టణంలో సీపీఎం కార్యాలయ నిర్మాణానికి తమవంతు సహకరిస్తానని ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సీపీఎం నాయకులు సేవ చేయాలన్నారు.మాజీ ఎమ్మెల్యే ఐజయ్య మాట్లాడుతూ దళితులు, వెనకబడిన బడుగు బలహీన వర్గాల ప్రయోజనాల కోసం సీపీఎం పని చేస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పగిడ్యాల: గురువారం గుండెపోటుకు గురై హఠాన్మరణం పొందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తెలుగు వెంకటరమణ(56) కుటుంబానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పంపిన రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సగినేల రమణ అందజేసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్త హఠాన్మరణం తీరని లోటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్, తెలుగు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కమనీయం..సీతారాముల కల్యాణం

● వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



మహానందిలో రాములోరి కల్యాణోత్సవం

మహానంది: శివకేశవులకు నిలయమైన మహానందిలో కొలువైన శ్రీ సీతాసమేత కోదండరాముల వారికి శ్రీరామనవమి సందర్భంగా గురువారం కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు రవి శంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా అభిషేకమండపానికి చేర్చిన అనంతరం స్వామివారి మూర్తులను కొలువు చేసి గణపతిపూజ, పీఠార్చన, కన్యాదానం, మహాసంకల్పం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, నీరాజన మంత్రపుష్పాలతో వరుడు రామయ్య చేత వధువుకు తాళి కట్టించి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. నంద్యాలకు చెందిన ఏజీఎస్ జ్యూవెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్ రాములవారి కల్యాణానికి ముత్యాలను, గురురాజ పాఠశాల షేక్షావలిరెడ్డి పట్టువస్త్రాలు అందించారు. సాయంత్రం హనుమద్వాహనంపై సీతారాముల వారి గ్రామోత్సవం వైభవంగా చేపట్టారు.

తిమ్మాపురంలో

మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, గాజులపల్లె ,గోపవరం, తమ్మడపల్లె, బుక్కాపురం, మసీదుపురం, సీతారామాపురం, శ్రీనగరం, అబ్బీపురం, నందిపల్లె, బొల్లవరం, తదితర గ్రామాల్లో సీతారాముల వారి కల్యాణోత్సవం కమణీయంగా చేశారు. తిమ్మాపురంలో కళ్యాణం అనంతరం భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాలను పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొని శ్రీరామనవమి వేడుకల్లో పాలుపంచుకున్నారు.

శ్రీశైలంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో పాతాళగంగ మెట్ల పైభాగాన వెలసిన ప్రసన్నాంజనేయస్వామివార్ల ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం గురువారం అత్యంత వైభవంగా శాస్త్రోక్తరీతిలో జరిగింది. ఈ వేడుకకు ముందు దేశం, రాష్ట్రం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, సకాలంలో వర్షాలు కురువాలని, దేశం పాడిపంటలతో తులతుగాలని మహాసంకల్పం చెప్పారు. ఆ తరువాత వేదపండితులు మహాగణపతిపూజ, పుణ్యాహవచన మొదలైన కార్యక్రమాలు చేశారు. ఆ తరువాత కంకణ పూజ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, వరపూజ, ప్రవర పఠన, నూతన వస్త్ర సమర్పణ, బాసిక సమర్పణ, గౌరిపూజ, మాంగల్యపూజ, సీతాదేవికి మాంగల్యధారణ, తలంబ్రాలు మొదలైన కార్యక్రమాలతో సంప్రదాయ బద్ధంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హెచ్‌జీ వెంకటేష్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, ఆలయ సహాయక కార్యనిర్వాహణాధికారి ఎమ్ హరిదాస్ పాల్గొన్నారు.

మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీరామనవమి సందర్భంగా గురువారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో మర్చెంట్ అసోసీయేషన్ ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రామాలయంలో, సరస్వతి శిశుమదిరంలో వేడుకలు జరిగాయి.

వెలుగోడులో కనుల పండువగా..

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. పురోహితులు యజ్ఞ నారాయణ స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శివ మల్లికార్జున, లావణ్య దంపతులు, బొంతల సురేష్, దుర్గాభవాని దంపతులు, లాలం వెంకట మురళీకృష్ణ, సాయి సింధుజ, భీమ్‌శెట్టి యతీంత్రనాథ్, సంధ్యారాణి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి అయోధ్య నగరధీశులు శ్రీరామచంద్రమూర్తి అను వరరత్నమునకు సీతామహాదేవి అను కన్యాకరత్నముతో వివాహం జరిపించారు. అలాగే పట్టణంలోని పాత ఆంజనేయస్వామి ఆలయం, పొట్టి శ్రీరాములు సెంటర్‌లో శ్రీరామ నవమ వేడుకలు నిర్వహించారు. వాసవీ కాంప్లెక్స్ వద్ద ఆర్యవైశ్య యువకులు పానకం పంపిణీ చేశారు.

కనుల పండువగా శ్రీరామ నవమి వేడుకలు

బండిఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా గురువారం నిర్వహించారు. ఏ.కోడూరు, బండిఆత్మకూరు, చిన్నదేవళాపురం గ్రామాల్లో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు పలు ఆలయాల్లో వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: కొత్తపల్లె గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో తారాముల ఉత్సవ విగ్రహాలకు కనుల పండుగగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం రామాలయం గుడిలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పురోహితులు యాదవేని లక్ష్మీ నరసయ్య శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. మండల కేంద్రంతో పాటు బావాపురం, నందికుంట, వీరాపురం ఆంజేయ స్వామి ఆలయంలో, లింగాపురం, శివపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రజలు చేసుకున్నారు.



శ్రీశైలంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కొత్తపల్లిలో మాంగళ్యధారణ చేయిస్తున్న దృశ్యం

కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

నందికొట్కూరు: పట్టణ, మండల పరిధిలోని శ్రీరామ దేవాలయాల్లో కనుల పండువగా శ్రీ సీతారాముల వారి కల్యాణం వేడుకలు పురోహితులు నరసింహాస్వామి, శేషయ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. మల్యాల గ్రామంలో జరిగిన శ్రీరామ కళ్యాణ వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచు ఉమాదేవి, ఆలయ ధర్మకర్త అనురాధ, కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు పసుపు కుంకుమ, జాకెటు అందజేశారు.



వెలుగోడు వాసవీ కాంప్లెక్స్‌లో పానకం పంపిణీ చేస్తున్న యువకులు



ఏ.కోడూరులో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



మల్యాల ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు



మల్యాల శ్రీరాముల దేవాలయంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్



సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని తూడిచెర్ల, తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు, మండ్లెం, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, తంగడంచ తదితర గ్రామాల్లో శ్రీసీతారాముల వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం వేళల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల్లో తిప్పారు. మండలంలోని తూడిచెర్లగ్రామంలో నిర్వహించిన కల్యాణవేడుల్లో నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, సర్పంచ్ బాలమద్దిలేటి, నాయకులు ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, ఎంపీటీసీ దొడ్డా నాగమణి, పారుమంచాలలో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, హేమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే...

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కళ్యాణ వైభవంగా జరిగింది. మద్దూరు మజరా కృష్ణానగర్ గ్రామంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మలూరు గ్రామంలో జెడ్పీటీసీ జ్యోతీ రామలింగేశ్వరరెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. సాయంత్రం వేళలో బెల్లం పానకం, పప్పు ప్రజలకు పంపిణీ చేశారు.



తుమ్మలూరులో కల్యాణం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ జ్యోతిరామలింగేశ్వరరెడ్డి దంపతులు

ఆత్మకూరులో వైభవంగా కల్యాణోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయలంలో, రామాలయంతో పాటూ పలు దేవాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల కల్యాణం సందర్భంగా సీతారాముల ఉత్సవవిగ్రహాలను చలువపందిళ్ల కింద కూర్చొపెట్టి బాజాభజంత్రీల నడుమ కనులపండువగా సీతారాముల కల్యాణం జరిగింది. సీతారాములకు ముత్యాల తంలంబ్రాలు వేశారు. ఉత్సవాలకు రేడియో, టీడీడీ ఉత్సవాల వ్యాఖ్యత దివిహయగ్రీవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కరివేన, కురుకుంద, కృష్ణాపురం, బాపనంతపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో కూడా సీతారాముల కల్యాణం రమణీయంగా జరిగింది. దేవాలయాల వద్ద భక్తులు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణ వేడుకలను జరిపిస్తున్న పురోహితులు

పగిడ్యాల: స్థానిక చెన్నకేశస్వామి దేవాలయంలో గురువారం పురోహితుల వేదమంత్రోచ్చరణల మధ్య సీతారాముల, లక్ష్మీచెన్నకేశవస్వామిల కల్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. భక్తులకు రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకలకు జెడ్పీటీసీ పుల్యాల దివ్య, వైస్ఎంపీపీ పల్లె అరుణమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.

సుంకేసులలో ఇష్టార్థ రాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల, మిడుతూరు, పీరుసాహెబ్ పేట, రోళ్లపాడు, జలకనూరు, దేవనూరు తదితర గ్రామాల్లోని ఆలయాలలో సీతారాముల కల్యాణం గురువారం కమనీయంగా సాగింది. సుంకేసుల గ్రామంలో శ్రీ దత్త ఆశ్రమ వ్యవస్థాపకులు, వే ొపండితులు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వేదపండితులు గూడా వెంకటచలపతి శర్మ సీతాసమేత ఇష్టార్థ రాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో కేరళ వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి. అలాగే దేవస్థాన నిర్మాణ రజతోత్సవ వేడుకల సందర్భంగా కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం సీతారాముల రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎస్ఐ మారుతీశంకర్ ఆధ్వర్యంలో గట్టి బందొబస్తు నిర్వహించారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



వెంకటేశ్వర్లు(ఫైల్)



న్యాయం చేయాలని కోరుతున్న శివమ్మ

కొత్తపల్లి: ఈనెల 14వ తేదీ అదృశ్యమైన నందికుంట గ్రామానికి చెందిన నిమ్మల వెంకటేశ్వర్లు (31) 18 రోజుల అనంతరం శవమై కనిపించాడు. ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లిన ఈ వెంకటేశ్వర్లు ఇంటింకి తిరిగి రాలేదు. ఈ విషయంపై కొత్తపల్లి పోలీసు స్టేషన్లో వ్యక్తి అదృశ్యం కేసు నమోదయ్యింది. మండలంలోని దుద్యాల గ్రామ సమీపంలోని తిక్కయ్యస్వామి దర్గా దగ్గర భవనాశి వాగులో గురువారం పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. సంఘటన స్థలాన్ని ఆత్మకూరు డీఎస్పీ శృతి, సీఐ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ముబీనాతాజ్ పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసి అక్కడే పంచనామ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయమైన సీఐ సుబ్రహ్మణ్యం విలేకరులతో వివరాలు వెల్లడించారు. నిమ్మల వెంకటేశ్వర్లు ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి ఆత్మకూరు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఇతను పాలెంచెరువు గూడెనికి చెందిన ఉత్తలూరి లక్ష్మీ, ఉత్తలూరి అంకమ్మ, ఉత్తలూరు పచ్చగడ్డి లింగన్నలతో కలసి నందికుంట గ్రామశివారులోని ఓ కూరగాయాలో తోటలోని వెళ్లారు. అక్కడ కూరగాయాలు తీసుకొని వస్తుండగా పొలానికి అటవీపందుల బారి నుంచి కాపాడుకొనేందకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి నిమ్మల వెంకటేశ్వర్లు చనిపోయాడు. పక్క పొలాల కాపలాదారులు రావడాన్ని చూసి వెంట వెళ్లిన వారు భయాందోళనకు గురై పారిపోయారు. తర్వాత ఆ పొలానికి కాపలా ఉన్న కురుకుంద గ్రామానికి చెందిన కాపలదారుడు దుర్గరావు సహాయంలో వారు శవాన్ని కిలోమీటరు తీసుకుపోయి ఎవరికి అనుమానం రాకుండా భవనాశి వాగులో పడేశారు. దుర్గారావును విచారించగా అతను మొత్తంవిషయాన్ని చెప్పి మృతదేహం ఎక్కడ ఉందని విషయం చెప్పాడు. ఈ విషయమై భార్య శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని సీఐ స్పష్టం చేశారు.

న్యాయం చేయాలి.. భార్య శివమ్మ

నాభర్తను చంపిన వారిని కఠినంగా శిక్షించి నాకు న్యాయం చేయాలని భార్య శివమ్మ కోరుతోంది. శివమ్మ మాట్లాడుతూ.. నా భర్తను ఈ నెల 14వ తేదీన రాత్రి పాలెంచెరువుకు చెందిన ఉత్తలూరి లక్ష్మీ, ఉత్తలూరి అంకమ్మ, పచ్చగడ్డి లింగన్నలు ఫోన్ చేసి ఎక్కడికో తీసుకు పోయారని, అప్పటినుంచి కనపడలేదని, వారిపై అనుమానంతో పోలీసు స్టేషన్లో కేసు పెట్టానని చెప్పింది. పోలీసులు విచారిస్తే కూరగాయాలకు వెళ్లింటే పొలానికి ఏరాప్పాటు చేసిన కరెంట్ తీగలు తగిలి చనిపోయాడని చెప్పారని, అయితే నాభర్తను ఉత్తలూరి లక్ష్మీనే మిగతా వారితో కలసి చంపించిందని ఆరోపించింది. ఆమెకు నాభర్తతో పాటు ఇంకో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, వారందరూ కలసి నాభర్తను చంపారని,వారందరిని అరెస్టుచేసి కఠిన శిక్షవిధించాలని కోరింది.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



వెంకటేశ్వర్లు(ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో అప్పులబాధ భరించలేక ఓ రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు లింగాపురం గ్రామానికి చెందిన చిమ్మే నడిపి వెంకటేశ్వర్లు (37) తనకున్న ఎకరంన్నర పొలంతో పాటు మరో ఏడున్నర ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. ఇందులో గత రెండేళ్ల నుంచి మినుము, పత్తి పంటలను సాగుచేసుకుంటున్నాడు. పంటల సాగు కోసం రూ.8లక్షల దాకా అప్పులు చేశాడు. పంటలు చేతిరాక నష్టం రావడంతో అప్పులోళ్ల బాధ తాళలేక ఇంట్లోనే పురుగుల మందు సేవి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ ముబీనా తాజ్‌ను వివరణ కోరగా ఈ విషయంపై ఎటువంటి ఫిర్యాదు మా వద్దకు రాలేదని చెప్పారు.

కురుకుందలో పానకం పంపిణీ



పానకం పంపిణీ చేస్తున్న సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీటీసీ కోట్ల రాజ్యలక్ష్మీ

ఆత్మకూరు :శ్రీరామనవమి సందర్భంగా కురుకుంద గ్రామంలో ఆలయం వద్ద గురువారం గ్రామ సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు కోట్ల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని బస్టాండ్ వద్ద చలివేంద్రాలు ప్రారంభించారు, కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల నాగేశ్వరరెడ్డి, బందెల మాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షతోనే డాక్టర్ అచ్చెన్న హత్య



డాక్టర్ అచ్చెన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌సీ కమిషన్ చైర్మన్

కర్నూలు(అర్బన్): కుల వివక్ష కారణంగానే వైఎస్సార్ జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్య జరిగిందని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన కర్నూలులోని డాక్టర్ అచ్చెన్న నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయన విధులు నిర్వహిస్తున్న పశు సంవర్ధక శాఖలో అనేక రకాల వేధింపులకు గురయ్యారన్నారు. ఉన్నతాధికారులు, పోలీసులకు, లోకాయుక్తకు ఫిర్యాదు చేసినా, ఎవరు పట్టించుకోపోవడం వల్ల ఈనెల 12న నమ్మించి తీసుకువెళ్లి హత్య చేశారన్నారు. డాక్టర్ అచ్చెన్న కుటుంబ సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్‌సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాట ఓబులేసు, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేకనే టీడీపీ దుష్ప్రచారం



దర్శనానంతరం ప్రధానాలయ రాజగోపురం వద్ద కుటుంబ సభ్యులతో బుడ్డాశేషారెడ్డి

శ్రీశైలం: జగనన్న సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక అనేక రకాలుగా టీడీపీ నాయకులు దుష్ప్రాచారాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి అన్నారు. గురువారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానం అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. ఎవరెంత నమ్మకద్రోహానికి పాల్పడినా గెలిచి మరో మారు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేసేది వైఎస్ జగన్ అనే ధీమా వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

నేడు జూపాడుబంగ్లాలో 'ఆసరా'

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మూడో విడత ఆసరా కార్యక్రమంలో పాల్గొని పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేయనున్నట్లు ఏపీఎం అంబమ్మ తెలిపారు. వైకేపీ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు.

కర్రెమ్మ గుడి పునఃప్రతిష్ఠ పూజలు

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు గ్రామంలో ఉన్న గ్రామదేవత కర్రెమ్మ గుడి పునఃప్రతిష్ఠ నిమిత్తం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామసర్పంచ్ పీఎం నాగిరెడ్డి మాట్లాడుతూ తిరుమల-తిరుపతికి చెందిన సమరత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని పునః ప్రతిష్ఠించేందుకుగాను ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సమరత ఫౌండేషన్ నిర్వాహకులు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

ఆత్మకూరు: విద్యుత్ ట్రూ అప్‌చార్జీలు పెంచడం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, రణధీర్ కోన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 23 నుంచి యునిట్‌కు రూ.65 పైసలు చొప్పున ట్రూఅప్‌చార్జీలు పేరుతో పెంచడం తగదన్నారు. రామ్‌నాయక్ తదితరులు పాల్గన్నారు.

ఇండోర్ స్టేడియానికి బోరు

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇండోర్ స్టేడియం వద్ద బోరు వేయించినట్లు శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డు నిర్మించిన ఇండోర్ స్టేడియం రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో నంద్యాల పార్లమెంట్ పోచా బ్రహ్మానందారెడ్డి నిధుల కింద బోరు వేశారు. రవికుమార్ మాట్లాడుతూ బోరులో 250 అడుగులకే రెండు ఇంచుల నీరు పడిందని చెప్పారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 600 అడుగుల వరకు బోరు వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చాంద్ బాషా, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో సెల్‌ఫోన్లు బంద్

శ్రీశైలం: శ్రీశైలం మండలంలో బుధవారం నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దోర్నాల నుంచి సున్నిపెంట వరకు ఉన్న బీఎస్ఎన్ఎల్ భూఅంతర్భాగ నెట్‌కేబుల్ తెగిపోవడంతో నెట్‌వర్క్ ప్రాబ్లమ్ ఏర్పడినట్లు బీఎస్ఎన్ఎల్ వర్గాల ద్వారా తెలిసింది. ఎట్టకేలను సేవలను పునరుద్ధరించడంతో గురువారం 11 గంటల నంచి బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఇతరనెట్‌వర్క్‌లు పనిచేశాయి.

సేవలతోనే గుర్తింపు

మహానంది: సేవా కార్యక్రమాల ద్వారా యువతకు మంచి గుర్తింపు వస్తుందని గాజులపల్లె సర్పంచ్ గద్దం చంటి అన్నారు. రోడ్డుప్రమాదంలో గాయపడిన గాజులపల్లెకు చెందిన గఫార్‌కు యువసేన సంస్థ అధ్యక్షుడు రవి, సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు వారు గురువారం గ్రామానికి చేరుకుని రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణ, సంస్థ సభ్యులు జఫరుల్లా, హుసేన్, రాము, తదితరులు పాల్గొన్నారు.